క్లుప్తంగా

వెంకట్రావుపల్లిలో ఉచిత వైద్యశిబిరం


పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు

బోయినపల్లి: వెంకట్రావుపల్లి గ్రామంలో కరీంనగర్ సన్‌షైన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేశారు. డాక్టర్ అపూర్వ వైద్య పరీక్షలు చేసి అవసరమున్న వారికి మందులు అందించారు. కోఆర్డినేటర్ సావనపెల్లి విక్రమ్ కిషోర్, వైద్య సిబ్బంది, గ్రామస్తులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట: వెంకటాపూర్ సబ్ స్టేషన్ మెయిన్ లైన్ మరమ్మతు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయముంటుందని సెస్ ఏఈ పృథ్వీధర్‌గౌడ్ శనివారం తెలిపారు. వెంకటాపూర్, పోతిరెడ్డిపల్లి, పదిర, అగ్రహారం గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు సరఫరా ఉండదన్నారు.

రేపు జాబ్ మేళా

సిరిసిల్లకల్చరల్: దేశంలో ప్రముఖ కార్పొరేట్ బ్యాంక్ దిగ్గజం ఐసీఐసీఐ, ఎన్ఐఐటీ సంయుక్తంగా పట్టణంలోని మహతి మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు బ్యాంక్ ప్రతినిధి సతీశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాలకు గుర్తింపు తేవాలి


మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కోనరావుపేట: విద్యార్థులు తాము చదివిన పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని పూర్వ విద్యార్థి అసోసియేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ గోగూరి మోహన్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పదోతరగతిలో అత్యధిక జీపీఏ సాధించిన విద్యార్థులు పి.పూజ, మారుపాక శ్రీజ, అంతడ్పుల రక్షిత, ఉప్పుల కావ్య, లంబ మధుప్రియలకు నగదు పురస్కారాలతోపాటు మెమెంటో అందజేశారు. మోహన్‌రెడ్డిని ఉపాధ్యాయులు సన్మానించారు. రిటైర్డ్ డాక్టర్ కొండం దయాసాగర్‌రెడ్డి, తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, ఎస్సై ఆంజనేయులు, సింగిల్‌విండో డైరెక్టర్ బానాపురం రంగారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి కమిటీ సమావేశం


మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

వీర్నపల్లి: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాలలో గ్రామ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. చైర్మన్ మల్లారపు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సెస్ డైరెక్టర్ మల్లేశం, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మత్తడి పనులు వేగవంతం చేయాలి


పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామ పరిధిలోని రంగంపేట చెరువు మత్తడి పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం రంగంపేట చెరువు మత్తడి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలు

కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట: హకీంపేట(హైదరాబాద్)లోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో 2024–25 విద్యాసంవత్సరానికి గాను 4వతరగతిలో ప్రవేశానికి విద్యార్థుల ఎంపిక ఉంటుందని మండల విద్యాధికారి రఘుపతి కోరారు. ఈనెల 24న నిజామాబాద్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎంపిక జరుగుతుందన్నారు. 8–9 ఏళ్ల లోపు(01–09–2015 నుంచి 31–08–2016 లోపు జన్మించిన) వారు అర్హులని, పుట్టిన తేదీ ధ్రువపత్రంతో హాజరు కావాలన్నారు.
వేములవాడఅర్బన్: తెలంగాణ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాల కోసం ఎంపిక నిర్వహిస్తున్నామని మండల విద్యాధికారి బన్నాజీ తెలిపారు. వేములవాడ, అర్బన్, రూరల్ మండలాల్లోని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల 4వతరగతి విద్యార్థులకు ఈనెల 25న ఉదయం 9 గంటలకు నాంపల్లిలోని నిర్మల పాఠశాలలో ఎంపిక నిర్వహించనున్నామన్నారు.

యూజ్‌ఫుల్ గాడ్జెట్స్..

- హెల్త్ అలర్ట్.. స్టయిలిష్ లుక్..
- బ్రాండెడ్ ఫోన్లు.. రిస్ట్ వాచ్‌లు
- స్మార్ట్ ఫీచర్లతో హెల్త్ మిషన్లు
- ఆరోగ్యానికి ఆధునిక టెక్నాలజీ..

సిరిసిల్లటౌన్: ఆధునిక టెక్నాలజీ ఆరోగ్యాన్ని పంచుతోంది. సరిగా వాడే వారికి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ ఉపయోగపడుతున్నాయి. నేటితరం స్మార్ట్ ఫోన్స్, స్మార్ట్ వాచ్‌లను వినియోగించడం ట్రెండ్‌గా చూస్తున్నారు. వాటిని కరెక్టుగా వినియోగించుకుంటే ఆయుష్షును కూడా పెంచుతాయన్న విషయాన్ని జనాలు గమనించాల్సి ఉంది.



స్మార్ట్‌గా.. ట్రెండ్లు..

మణికట్టుకు అందంగా ఇమిడే స్మార్ట్ వాచ్‌లు, స్మార్ట్ బ్యాండ్లు అన్ని వర్గాలను అలరిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో స్మార్ట్ ఎలక్ట్రానిక్ పరికరాలు హల్ చల్ చేస్తున్నాయి. అరచేతిలో ప్రపంచం.. మణికట్టుపై ఆరోగ్యాన్ని ప్రతిబింబిస్తూ.. ఫిట్‌నెస్‌ను పెంచుతున్నాయి. అన్ని బ్రాండెడ్ కంపెనీలు వీటిని మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. బ్రాండ్‌ను బట్టి దానికి సంబంధించిన యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని అన్ని విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు నేరుగా పని చేస్తే.. మరికొన్ని స్మార్ట్ పరికరాలు మాత్రం అండ్రాయిడ్, ఐవోఎస్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో పని చేస్తాయి. ముఖ్యంగా అక్సిలేటర్ మీటర్, హార్ట్‌రేట్ తెలుసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. స్లీపింగ్ టైమింగ్‌తోపాటు మనం రోజులో ఎన్ని మెట్లు ఎక్కామో కూడా స్మార్ట్ బ్యాండ్స్‌తో తెలుసుకోవచ్చు.

ఉపయుక్తం..

నోకియా, మోటోరోలా, ఆపిల్, రెడ్మీ, స్యామ్‌సంగ్, మైక్రోమ్యాక్స్, కార్బన్, ఇంటెక్స్, వివో, ఐక్యూ,



రియల్‌మీ తదితర బ్రాండెడ్ కంపెనీలు అన్ని ఫీచర్లతో ఉన్న స్మార్ట్ ఫోన్లను అందిస్తున్నాయి. ఈ ఫోన్లను స్మార్ట్ వాచ్‌లకు అనుసంధానం చేసుకొని సులువుగా వినియోగిస్తున్నారు. పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా యాప్‌లతోపాటు కొత్తగా ఇన్‌ఫ్రారెడ్ రిమోట్ కంట్రోల్, మల్టీపుల్ విండోస్, సెల్ఫీ కోసం ప్రత్యేకంగా డబుల్ ఫ్రంట్ కెమెరా, బ్యాక్ డబుల్ కెమెరా ఫీచర్లకు ప్రస్తుతం ఆదరణ ఎక్కువగా ఉంది. మల్టిపుల్ ఫీచర్లతోపాటు అధిక స్టోరేజీ కెపాసిటీ, మంచి ఫీచర్లు గల స్మార్ట్ ఫోన్లు మార్కెట్‌లో రూ.7వేల నుంచి రూ.1.40లక్ష వరకు లభ్యమవుతున్నాయి.

ఈ–ఆరోగ్య పరికరాలు..

ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవనంలో జనాలు అనారోగ్యం బారిన పడుతున్నారు. కోవిడ్–19 తర్వాత చాలామంది సైడ్ ఎఫెక్టులతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌లో స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ బ్యాండ్స్, స్మార్ట్ వాచ్, పల్స్ ఆక్సీమీటర్స్, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్, ఈ థెర్మోమీటర్, ఈ–బీపీ మిషన్ వగైరా మిషనరీని ప్రజలు వినియోగిస్తున్నారు. సాధారణ, బ్రాండెడ్ కంపెనీలు వీటిని మార్కెట్ చేస్తున్నాయి. తక్కువ ధరల్లో దొరికే స్మార్ట్



ఫోన్ల ఫీచర్లను పూర్తిస్థాయిలో వినియోగించడానికి స్మార్ట్ బ్యాండ్లు, స్మార్ట్ వాచ్‌లు ఉపయుక్తంగా ఉంటున్నాయి. ఆయా కంపెనీలు ఆండ్రాయిడ్ ఫీచర్ల వినియోగాన్ని బట్టి స్మార్ట్ బ్యాండ్లను తయారు చేస్తూ యువతను ఆకట్టుకుంటున్నాయి. ఫోన్ దూరంగా ఉన్నా ఈ బ్యాండ్స్‌తో ఫోన్‌కు వచ్చే కాల్స్ సైతం తెలుస్తాయి. స్మార్ట్ బ్యాండ్స్‌కు ఉన్న సెన్సార్ ఆధారంగా వివరాలన్నీ తెలుస్తాయి. రూ.1,500 నుంచి రూ.90వేలకు పైగా ధరల్లో ఈ స్మార్ట్ ఎలక్ట్రానిక్ పరికరాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి.



ఓ పార్టీ జిల్లాస్థాయి నాయకుడు ఒకరికి గుండెపోటు వచ్చే అవకాశముందని అతడి మణికట్టుకున్న యాపిల్ వాచ్ అలర్ట్ చేసింది. వెంటనే అప్రమత్తమై హైదరాబాద్‌కు వెళ్లి ఆస్పత్రిలో చూపించుకోగా.. హార్ట్‌లో ఉన్న సమస్య నిజమేనని చెప్పి చికిత్స అందించారు. ప్రాణాపాయం నుంచి బయటపడ్డ ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది.



సిరిసిల్లకు చెందిన ఓ వృద్ధురాలు లక్ష్మి(70) చాలా రోజులుగా దమ్ము, ఆయాసంతో ఇబ్బంది పడుతోంది. ఆస్పత్రికి వెళ్తే ఊపిరితిత్తుల్లో సమస్యగా ఉందని చెప్పి చికిత్స అందించారు. ఇంటి వద్దే ఆక్సిజన్ పెట్టుకోవాలని సూచించగా.. లయన్స్ క్లబ్ వారిని ఆశ్రయిస్తే ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను అందించారు. ఇంట్లోనే ఉంటూ.. స్వచ్ఛమైన ప్రాణ వాయువును తీసుకుంటూ.. 2నెలలుగా ఆరోగ్యంగా ఉంటున్నారు.

హార్ట్‌బీట్‌ను పరీక్షిస్తా..



స్మార్ట్ వాచ్‌ను చాలా రోజులుగా వినియోగిస్తున్నా. అప్పట్లో నాకు హార్ట్‌బీట్ ఎక్కువగా ఉండేది. వాచ్ ద్వారా ఎప్పటికప్పుడు హార్ట్‌బీట్‌ను పరీక్షించుకుంటూ ఉంటా. కచ్చితంగా ప్రతిరోజు 7వేల నుంచి 10వేల అడుగులు నడుస్తా. చాలామంది స్మార్ట్ వాచ్‌లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను సరిగా వినియోగిస్తే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందొచ్చు.
– డాక్టర్ పంతగాని పెంచలయ్య, సివిల్ సర్జన్

హెల్త్ ఫీచర్స్ కోసమే..



మార్కెట్లో ఎన్నో రకాల స్మార్ట్ ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అందుబాటులో ఉన్నాయి. బ్రాండెడ్ కంపెనీల గాడ్జెట్స్‌ను అడుగుతున్నారు. మామూలు కంపెనీలు రూ.1,000 నుంచి రూ.20,000, బ్రాండెడ్ కంపెనీలు రూ.50వేల నుంచి రూ.90వేల ధరల్లో ఉన్నాయి. ప్రత్యేకంగా హెల్త్ ఫీచర్స్ కోసమే చాలామంది ఆర్డర్లు ఇస్తున్నారు. ఫోన్ లేకుండా కాల్స్, మెస్సేజ్ ఆపరేట్ చేయొచ్చు.
– గోపిశెట్టి మునీందర్, మొబైల్ షాపు యజమాని

ఆరోగ్య పరిస్థితిని తెలుపుతుంది



స్మార్ట్ వాచ్‌లో హెల్త్ ఆక్టివిటీ ట్రాక్ చేసుకున్నా. రోజు ఎంత వర్క్ అవుట్ చేస్తున్నా.. ఎంత సమయం గాఢ, మామూలు నిద్రించిన విషయాలను తెలుపుతుంది. మన ఆరోగ్య పరిస్థితిని బట్టి ఎంతవరకు వ్యాయామం చేయాలో నిర్దేశిస్తుంది. మానసిక ఒత్తిడిని కూడా సూచిస్తుంది. మార్కెట్‌లో మరిన్ని అప్‌డేట్ ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వస్తున్నాయి. వాటిని మనకు కావాల్సిన రీతిలో ఉపయోగించుకోవడం బెటర్.
– గుడ్ల హారిక, సాఫ్ట్‌వేర్ ఎంప్లాయి

మోసం చేసిన గల్ఫ్ ఏజెంట్ అరెస్ట్

గంభీరావుపేట(సిరిసిల్ల): గల్ఫ్ పంపిస్తానని మోసం చేసిన ఏజెంట్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గంభీరావుపేట ఎస్సై రామ్మోహన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు. గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన చీకోటి స్వామిని గల్ఫ్ పంపిస్తానని జగిత్యాల జిల్లా సారంగాపూర్‌కు చెందిన దండుగుల సురేష్ నమ్మించి ఒరిజినల్ పాస్‌పోర్టు, రూ.10వేల నగదు తీసుకొని మోసం చేశాడు. బాధితుని ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుని నుంచి ఎనిమిది మందికి చెందిన ఒరిజినల్ పాస్‌పోర్టులు, రెండు సెల్‌ఫోనులు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.


నిందితున్ని అరెస్టు చూపుతున్న ఎస్సై రామ్మోహన్

సత్యనారాయణ స్వామి వ్రతాలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): స్థానిక శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.



చందుర్తి పీహెచ్‌సీలో తప్పిన ప్రమాదం

చందుర్తి: చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థలో ఉండగా.. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షానికి భవనం తడిసింది. దీంతో భవనం పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. అప్పటివరకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన రోగులతో బిజీగా ఉన్న ఆసుపత్రి ప్రాంగణం.. రోగులు వెళ్లిపోయిన కొద్దిసేపటికే భవనం పైకప్పు పెచ్చులూడి కింద పడ్డాయి. ఎవరూ లేకపోవడంతో భారీ ముప్పు తప్పిందంటూ ఆరోగ్య కేంద్రంలో ఉన్న వైద్య సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.


చందుర్తి పీహెచ్‌సీలో వర్షానికి కింద పడిన పైకప్పు పెచ్చులు

నారు మడిపై అడవి పందుల దాడి

వీర్నపల్లి: మండల కేంద్రంలో సామల్ల చిరంజీవికి చెందిన వరి నారు మడిలో శుక్రవారం రాత్రి అడవి పందులు దాడి చేశాయి. మడి పూర్తిగా దెబ్బతిందని రైతు ఆవేదన చెందాడు. అడవి పందుల దాడి నుంచి పంట పొలాలను కాపాడుకోవడానికి రాత్రి సమయంలో కాపు కాస్తున్నామన్నారు. అయినా అడవి పందులు అర్ధరాత్రి గుంపులుగుంపులుగా వచ్చి ధ్వంసం చేసి పోతున్నాయని అన్నారు.



రుణాలు విడుదల చేయాలి

వీర్నపల్లి: పెండింగ్ రుణాలు విడుదల చేయాలని బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ కోరారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరుపేద కుటుంబాలకు ఆర్థిక అభివృద్ధి, వివిధ స్వయం ఉపాధి పథకాలకు ప్రతి సంవత్సరం వార్షిక ప్రణాళిక కేటాయింపులున్నాయన్నారు. స్వయం ఉపాధి పథకాల్లో భాగంగా గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్లలో లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో గ్రౌండింగ్ పూర్తి చేసి మంజూరు లెటర్లు ఇచ్చారని అన్నారు. వారికి ఇంత వరకు అకౌంట్లలో డబ్బులు జమ కాలేదని వాపోయారు. నాలుగేళ్ల క్రితం లోన్లకు సంబంధించి ఇప్పటివరకు రుణాలు విడుదల చేయకుండా జాప్యం జరిగిందన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన వికాస్‌రావు


కిషన్‌రెడ్డితో వికాస్‌రావు

వేములవాడఅర్బన్/వేములవాడరూరల్: వేములవాడ బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డా.చెన్నమనేని వికాస్‌రావు దీప శనివారం హైదరాబాద్‌లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు


కలెక్టర్‌కు పూల మొక్క అందిస్తున్న ప్రజాప్రతినిధులు

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ మండల ప్రజాప్రతినిధులు శనివారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూను కలెక్టర్ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందించారు. ముంపు గ్రామాల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. జెడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు, ఎంపీటీసీ రవిచందర్‌రావు తదితరులున్నారు.

మంత్రి బండి సంజయ్‌ని కలిసిన నాయకులు


ఎల్లారెడ్డిపేట: కేంద్ర సహాయ మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట శ్రీవేణుగోపాలస్వామి ఆలయ కమిటీ సభ్యులు శనివారం కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ సనుగుల ఈశ్వర్ మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక పట్టణ పార్టీ అధ్యక్షుడు నంది నరేశ్, మండల ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి, యువ మోర్చా ఉపాధ్యక్షులు రాజుయాదవ్, బుర్క వేణు, ఎండీ అబ్దుల్‌మియా తదితరులు కలిశారు.
వీర్నపల్లి: కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు గునుకుల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు కలిశారు. బోడ మల్లేశం, తిరుపతి, సుమన్, జగమాల్, పంతులు, బంతిలాల్, రామ్‌చందు తదితరులున్నారు.
బోయినపల్లి: బండి సంజయ్‌కుమార్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు సత్కరించారు. ఉదారి నర్సింహాచారి, క్యాతం తిరుపతిరెడ్డి, తదితరులున్నారు.
వేములవాడఅర్బన్: మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బుర్ర లహరిక శేఖర్ బండి సంజయ్‌ను కలిశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సిరిసిల్లటౌన్: రాష్ట్ర రైతాంగానికి సీఎం రేవంత్‌రెడ్డి అపురూప కానుక రైతు రుణమాఫీ చేశారని కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం సిరిసిల్ల గాంధీచౌక్‌లో పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, వెల్ముల స్వరూప పాల్గొన్నారు.
వేములవాడ: తెలంగాణ చౌక్‌లో కాంగ్రెస్ నాయకులు, రైతులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇందుకు సహకరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.
వేములవాడఅర్బన్: రైతుల మేలు కోరే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు పిల్లి కనకయ్య అన్నారు. వేములవాడ నంది కమాన్ వద్ద మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం


సిరిసిల్లటౌన్: రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకి పాలాభిషేకం చేశారు. ప్రభాకర్‌రెడ్డి, పర్శ రాములు, కనకయ్య, రమేశ్, లింగయ్య తదితరులున్నారు.
వీర్నపల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బూత శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు, కార్యకర్తలు తదతరులు పాల్గొన్నారు.
తంగళ్లపల్లి: పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నేరెళ్ల నర్సింగంగౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో స్వీట్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు ప్రవీణ్ జేటోని మాట్లాడారు. నాయకులు లింగాల భూపతి, చుక్క రాజశేఖర్, పెద్దూరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.
గంభీరావుపేట: మండల కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. హమీద్, కొమిరిశెట్టి తిరుపతి, రాంచంద్రారెడ్డి, రాజవీర్, గంగి స్వామి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.
కోనరావుపేట: కాంగ్రెస్ రైతుల పక్షపాత ప్రభుత్వమని డీసీసీ ఉపాధ్యక్షుడు చేపూరి గంగాధర్ అన్నారు. రూ.2లక్షల వరకు రుణమాఫీకి మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో నిమ్మపల్లిలో సంబరాలు జరుపుకున్నారు. పెంతల శ్రీనివాస్, నాగండ్ల భూమేశ్, మానుక సత్యం, సదానందం, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.
ఎల్లారెడ్డిపేట: పాత బస్టాండ్‌లో కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బ్లాక్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడారు. కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, సద్ది లక్ష్మారెడ్డి, రాజయ్య, గౌస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేయించిన కానిస్టేబుల్

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్, కామారెడ్డి ప్రధాన రహదారిపై గూడూరు స్టేజీ వద్ద గల ప్రమాదకర గుంతలను కానిస్టేబుల్ రాజశేఖర్ శనివారం పూడ్చివేయించారు. కామారెడ్డి ప్రధాన రహదారిపై గూడూరు స్టేజీకి ఎదుట బుగ్గ వాగు ఉండగా.. ఇక్కడే ప్రమాదకరంగా గుంతలు ఏర్పడ్డాయి. పలువురు ఈ గుంతలు తప్పించబోయి ప్రమాదాలకు గురై మృత్యువాత పడ్డారు. ఎందరో క్షతగాత్రులయ్యారు. ప్రమాదాల నివారణకు సిమెంట్ తెప్పించి రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చివేయించినట్లు కానిస్టేబుల్ రాజశేఖర్ తెలిపారు.



మహిళల ఆర్థికాభివృద్ధికి సహకరించాలి

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా గ్రామ మహిళా సంఘాల వీవోఏలు పని చేయాలని ఏపీఎం మల్లేశం అన్నారు. మండల కేంద్రంలోని కావేరి మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం మహిళా సంఘాల వీవోఏలకు రుణాలు, బ్యాంక్ లింకేజీ అంశాలపై సమీక్ష నిర్వహించారు. మహిళా శక్తిలో భాగంగా మహిళా ఉన్నతి, తెలంగాణ ప్రగతి కింద సభ్యులకు ఆర్థిక అభివృద్ధికి చిన్న పరిశ్రమలు, సామాజిక భద్రత కల్పించాలన్నారు. జ్యోతి, మంగ్యానాయక్, దేవేందర్, రమణ, సుధాకర్, పద్మ, వీవోలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఐడీ కార్డులు అందజేత

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయ ప్రాంగణంలో శనివారం నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ హమీద్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. వివిధ మండలాల హ్యూమన్ రైట్స్ బాధ్యులకు ఐడీ కార్డులు, అపాయింట్మెంట్ లెటర్‌లను ఎంపీపీ పడిగెల మానస రాజు అందజేశారు.

పుస్తకాల పంపిణీ

సిరిసిల్లటౌన్: గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో శనివారం బాబాజినగర్ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. గోపా అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ చేయూతను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు.

చెక్కు అందజేత

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, సింగిల్‌విండో డైరెక్టర్ చెరకు శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా.. శనివారం బీఆర్ఎస్ తరఫున ప్రమాద బీమా రూ.2లక్షల చెక్కును బాధిత కుటుంబానికి రసమయి అందజేశారు.

పేకాట స్థావరంపై దాడి

సిరిసిల్లక్రైం: అంబేడ్కర్‌నగర్‌లోని సిరిగిరి చిన్న నర్సయ్య అనే వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను పట్టుకున్నట్లు సిరిసిల్ల టౌన్ ఇన్‌చార్జి సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

పాఠశాలల సన్నద్ధత అందరి బాధ్యత

ముస్తాబాద్: పాఠశాలల సన్నద్ధత ఉపాధ్యాయులందరి బాధ్యత అని ముస్తాబాద్ నోడల్ ఆఫీసర్ రాజిరెడ్డి అన్నారు. ముస్తాబాద్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని చీకోడు, మద్దికుంట, మోహినికుంట పాఠశాలలను శనివారం పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరిగా అందించాలన్నారు.

భగీరథ పైప్‌లైన్ లీకేజీ



వేములవాడ: వేములవాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో నీరంతా వృథాగా పోయింది. శనివారం ఉదయం నుంచి భగీరథ నీళ్లు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై ఎగిసి పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగిందని బాలానగర్ కాలనీవాసులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు సమాచారమందించగా.. స్పందించిన ఆది శ్రీనివాస్ సంబంధిత శాఖ అధికారులకు చెప్పడంతో లీకేజీని అరికట్టారు.

సీఐల బదిలీ

సిరిసిల్లక్రైం: జిల్లాలో ఇద్దరి సీఐలను బదిలీ చేస్తూ ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సిరిసిల్ల ఎస్బీ సీఐగా పని చేస్తున్న సీఐ అనిల్‌కుమార్ కార్యాలయంలో రిపోర్టుకు ఆదేశాలుండగా.. ఇప్పటివరకు వేములవాడ అటాచ్డ్ సీఐగా పని చేస్తున్న వీరప్రసాద్‌కు పూర్తి బాధ్యతలను అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బీఈడీ చేసిన ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలి

ముస్తాబాద్: బీఈడీ చదివిన సెకండ్ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని బీసీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లమ్మల లక్ష్మణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండల వనరుల కేంద్రంలో ఎస్జీటీ ఉపాధ్యాయులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులు అర్హులు కారని ప్రభుత్వం భావించినందున.. స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు.